వ్యాసం

# డ్యాములు - నిర్వాసితులు

శ్రీశైలం ప్రాజెక్టు ఫలితంగా మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలో ఇండ్లు , పొలాలు ముంపుకు గురయి నిర్వాసితులయిన ప్రజలకు నష్టపరిహారం కట్టివ్వడంలోను, పునరావాసం కల్పించడంలోను ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అమానుషమైన నిర్లక్ష్యవైఖరి వలన ప్రజలు తీవ్రమైన నష్టాలకు గురవుతున్నారు.

పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ కమిటీ రెండు జిల్లాలలోని 21 ముంపు గ్రామాలు రైతులతో వివరంగా మాట్లాడింది. గ్రామాల పేర్లు :

**ఆలంపూర్ తాలుకా :** ప్రాగటూరు, మారుమునగల, క్యాతూర్, యావల్దేవపాడు, గుంటుమల్లి.

**కొల్లాపూర్ తాలుకా :** సోమశిల, మంచాలకట్ట, జటప్రోలు, కొప్పునూరు, చిన్నమరూర్, వెల్లటూర్, చెల్లెపాడు, సోలీపురం, కాలూరు.

**నందికొట్కూర్ తాలూకా :** బిజినవేముల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, జీరవోలు, పాతకోట, తాటిపాడు, సిద్దేశ్వరం (ప్రస్తుత నివాసం జూపాడు బంగ్లా).

రైతులు, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల సంయుక్త కార్యచరణ కమిటీ నాయకులు, అడ్వకేట్లు చెప్పిన విషయాల దృష్ట్యా కొన్ని అంశాలు స్పష్టమవుతున్నాయి.

**నష్టపరిహారం :** 1974లో ముంపు గ్రామాలలో భూమి సేకరణ ప్రారంభించినప్పుడు ప్రభుత్వం పూర్తి మార్కెట్ ధర కట్టిచ్చి వుంటే సమస్య తొలినాడే తీరిపోయి ఉండేది. ప్రభుత్వం ఆ పనిచేయకుండా చాలా తక్కువ ధర కట్టిచ్చింది. మెట్ట భూములకు ఎకరానికి 500 నుండి 1000 వరకు, మాగాణికి 2500 నుండి 3500, కెసి కెనాల్ ఆయకట్టు భూములకు 500 రూపాయలు ఇచ్చింది. ఇది అప్పటి మార్కెట్ ధరలకంటే బాగా తక్కువ. ఇండ్లకు కూడా నష్టపరిహారం చాలా తక్కువ ఇచ్చింది. కోల్పోయిన ఇల్లు తిరిగి కట్టుకోవడానికి అయ్యే ఖర్చులో సగానికి కూడా అది సరిపోలేదని రైతులు అంటున్నారు.

ఆ తరువాత నష్టపరిహారం సమస్య కోర్టుల కెక్కింది. అది కోర్టుల కెక్కిన క్రమాన్ని గురించి, ప్రభుత్వం వ్యవహరించిన అప్రజాస్వామికమయిన తీరు గురించి దిగువ చూద్దాం.

ప్రభుత్వం ఇచ్చిన నామమాత్రపు నష్టపరిహారాన్ని స్వీకరించిన 8 వారాలలోగా రైతులు తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేసే పక్షంలో భూమి సేకరణ చట్టం (1894) సెక్షన్ 18 ప్రకారం ప్రభుత్వం కేసును కోర్టుకు నివేదించాలి. (రెఫర్ చేయాలి). ఇది ప్రభుత్వం తప్పనిసరిగా అనుసరించవలసిన బాధ్యత. అయితే ముంపు గ్రామాల రైతులలో నూటికి 10 శాతం మట్టుకే 8 వారాలలోపల తమ అభ్యంతరాన్ని నమోదు చేసారు. మిగిలిన వాళ్లు అజ్ఞానం వల్ల ఆ పని చేయలేదు. వాళ్ల హక్కులను వాళ్లకు తెలియజేసే బాధ్యత ఉన్న ప్రభుత్వం ఆ పని చేయకుండా, రైతులను మోసం చేయాలని చూసింది. 1980 దాకా ఊళ్లు ఖాళీ చేయవలసిన అవసరం రాలేదు. కాబట్టి రైతులు పట్టించుకోలేదు.

చివరికి 1980-81 సంవత్సరాలలో ప్రభుత్వం బుల్‌డోజర్లు తీసుకొచ్చి గోడలు కూలగొట్టి బలవంతంగా ఊళ్లు ఖాళీ చేయించేసరికి ప్రజలు మేల్కొన్నారు. కొత్తగా ఇళ్ళ ప్లాట్లు వేరే స్థలంలో కొనుక్కోవాలన్నా, ఇళ్లు కట్టుకోవాలన్నా పొలాలు చేసుకోవాలన్నా వాళ్ల చేతిలో చిల్లి గవ్వలేదు. అప్పుడు, అడ్వకేటు దగ్గరికి పరుగెత్తారు. వాళ్ల 8 వారాల గడువును విస్మరించి అన్ని కేసులను కోర్టుకు నివేదించాలంటూ హైకోర్ట్‌లో రిట్ పిటిషన్ వేసారు. హైకోర్టు ఆ అభ్యర్థనను అంగీకరించి 1980లో మొదటిసారి రిట్ జారీ చేసినప్పటి నుండి రైతులంతా హైకోర్టుకు పోయి అర్డర్లు తెచ్చుకుంటూనే ఉన్నారు.

ప్రభుత్వం హైకోర్టు మందలింపుకయినా చలించి తన బాధ్యతను గుర్తించి త్వరగా న్యాయమయిన నష్టపరిహారం ఇప్పించి వుంటే సరిపోయేది. కానీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుండా హైకోర్టు తీర్పు మీద అప్పీల్ వేసింది. ఆ అప్పీల్‌ను హైకోర్టు కొట్టేస్తే రివిజన్ పిటిషన్ వేసింది. దానిని కూడా హైకోర్టు కొట్టేసిన తరువాత నెమ్మదిగా క్రింది కోర్టులకు ఒక్కొక్క రైతు కేసును నివేదించడానికి ఉపక్రమించింది. 1984 నుండి క్రింది కోర్టులలో కేసుల విచారణ ప్రారంభం అయింది. 117 గ్రామాలకు చెందిన 1.08 లక్షల ఎకరాల భూమి, 21 వేల ఇళ్లకు సంబంధించిన కేసులను నడిపించడానికి కేవలం పిడికెడు మంది భూమిసేకరణ కార్యాలయ సిబ్బందిని ప్రభుత్వం వినియోగించింది. వాళ్లతో పనిచేయించుకోవడం కోసం లక్షల రూపాయలు లంచంగా రైతులు సమర్పించుకోవలసి వచ్చింది.

1986 నుండి కోర్టు తీర్పులు రాసాగాయి. 1974లో ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం న్యాయమయిన విలువ కంటే తక్కువగా ఉందనే ప్రతి ఒక్క కేసులోను కోర్టులు నిర్ణయించాయి. అదనపు నష్టపరిహారాన్ని మంజూరు చేసి, సంవత్సరానికి 15 శాతం వడ్డీ లెక్క గట్టి ఇమ్మని కోర్టులు ఆదేశించసాగాయి. దీనితో మొత్తం నష్టపరిహారం మొదట్లో ఇచ్చిన దానికి అయిదారు రెట్లు పెరిగింది. దురదృష్టవశాత్తు ఈ లోపల భూముల ఖరీదు, ఇంటి నిర్మాణానికి ఉపయోగించే వస్తువుల ఖరీదు, కోర్టు నిర్ణయించిన వడ్డీ రేటు (15%) కంటే చాలా వేగంగా పెరగడం వల్ల, కోర్టు మంజూరు చేసిన నష్టపరిహారం కూడా కొత్త ధరలలో పాత

ఆస్తులు సంపాదించు కోవడానికి పగానికి కూడా సరిపోని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తెలివి తక్కువతనానికి ఇంతకన్న నిదర్శనం అనవసరం.

అయినా కోర్టులు తీర్మానించిన నష్టపరిహారం కూడా ప్రభుత్వం ఇవ్వదలచుకోలేదు. ఒక్కొక్క సంవత్సరం 10 లేక 15 కోట్ల రూపాయల ఆదనపు నష్టపరిహారాన్ని కోర్టులు తమ తీర్పుల ద్వారా మంజూరు చేస్తుండగా, ప్రభుత్వం కేవలం 50 లక్షలు, 75 లక్షలు లేక 1 కోటి రూపాయలు కోర్టులలో డిపాజిట్ చేస్తూ వుంది. ఇది ఆర్డర్ పొందిన రైతులందరికీ సరిపోదు కాబట్టి వకీళ్ళు అదికార్లకు లంచాలు ఇచ్చి తమ క్లైంట్లకు ఇప్పించు కోవడానికి పోటీ పడ సాగారు. ముఖ్యంగా, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొందరు అడ్వకేట్లు రైతులు పొందిన నష్ట పరిహారంలో 30 లేక 35 శాతం తాము ఫీజుగా తీసుకొని అందులో 5 లేక 10 శాతం స్పెషల్ కలెక్టర్‌కు లంచం ఇచ్చి, ప్రభుత్వం డిపాజిట్ చేసిన కొద్దిపాటి నష్టపరిహారాన్ని తమ క్లైంట్లకు ఇప్పించుకొన్నారు. ఈ విధంగా ప్రభుత్వం అనుసరిస్తున్న దగుల్బాజీ వైఖరి వల్ల అడ్వకేట్లు అధికారులు బాగుపడగా రైతులు నష్టపోతున్నారు.

ప్రభుత్వం దగుల్బాజీ తనం అక్కడితో ఆగిపోలేదు. 8 వారాల గడువు దాటిన తరువాత అభ్యంతరం తెలిపిన రైతుల కేసులు ఎట్టి పరిస్థితులలోను (హైకోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ) కోర్టుకు నివేదించ కూడదంటూ ఒక ఆర్డినెన్స్ తేవాలని జనార్ధన్‌రెడ్డి ప్రభుత్వం కొద్ది నెలల క్రింద ప్రయత్నించింది. అయితే కొందరు స్థానిక రాజకీయ నాయకులు సకాలంలో గమనించి దానిని అడ్డుకున్నారు. గవర్నర్‌తోను, ప్రధానమంత్రితోను మాట్లాడి దానిని ఆపుజేయించారు.

ఇప్పటి పరిస్థితి ఏమిటంటే మొత్తం మునిగిపోయిన 11,00,000 ఎకరాల భూమిలో 21,000 ఇళ్ళలో, కేవలం 20 లేక 30 శాతం మాత్రమే కోర్టుల నుండి అదనపు నష్టపరిహారం పొందాయి. మరొక 40 శాతం దాకా కోర్టులో తీర్పు అయి కూడా నష్ట పరిహారం చేతికి రాలేదు. మిగిలిన 30 లేక 40 శాతం ఇంకా కోర్టు తీర్పుకు కూడా నోచుకోలేదు. భూమి సేకరణ కార్యక్రమం మొదలు పెట్టిన 18 సంవత్సరాలకు ఇదీ పరిస్థితి! ఇప్పటికి రైతుల చేతికి 48 లేక 50 కోట్ల రూపాయల నష్టపరిహారం వచ్చింది. ప్రస్తుత ధరలలో పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలంటే కనీసం 250 లేక 300 కోట్లు కావాలని అంచనా. ఇది ప్రభుత్వం ఎప్పటికి ఇస్తుంది.? ఇచ్చే ఉద్దేశ్యం ఉందా? లేకపోతే జాప్యం చేస్తూ పోతే విసిగి వేసారిన రైతులు ఏదో ఒక రాజీకి వచ్చి కోర్టు కేసులు ఉపసంహరించుకుని బేరానికి ఒప్పుకుంటారని ప్రభుత్వం ఆశిస్తూ ఉందా? ఇదే ప్రభుత్వం దృష్టి అని 14/5/91న జారీ చేసిన జివో(జివో ఎమ్.ఎస్. నం.100) ను బట్టి తెలుస్తుంది. లోక్ అదాలత్‌ను వెలకొల్పి తొలివాడు ఇచ్చిన నామమాత్రపు నష్టపరిహారానికి దాదాపు 2 రెట్లు ఇచ్చి, 11% లెక్కన వడ్డీ కట్టి ఇచ్చేటట్లు ఆ జివోలో ప్రభుత్వం సూచించింది. దీని ప్రకారం రైతులందరికీ కలిపి 75 కోట్లు వస్తాయి. కానీ న్యాయంగా రావల సింది 250 లేక 300 కోట్లు . రైతులను విసిగించి రాజీకి ఒప్పిం చాలనేదే ప్రభుత్వ యోచన.

**నిర్వాసిత గ్రామాల స్థితి :** నష్ట పరిహారం ఆ విధంగా ఉండగా, గ్రామాల పునరా వాసానికి ప్రభుత్వం చేసింది దాదాపు శూన్యం. బుల్‌డోజర్ల తో గోడలు కూల్చి గ్రామాలు ఖాళీ చేయించిన తరువాత ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. ప్రజలు క్రొత్తగా ప్లాట్లు కొనుక్కొని ఇళ్లు స్వంత ఖర్చుతో కట్టుకొని కొత్త గ్రామాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్క గ్రామానికి క్రొత్త స్థలంలో తిరిగి గ్రామం రూపం రావడానికి 2 నుండి 5 ఏళ్లు దాకా పట్టింది. ఏ గ్రామానికీ గతంలో ఉన్న సదుపాయాలు ఇప్పుడు లేవు. ముఖ్యంగా కొల్లాపూర్, ఆలంపూర్ తాలుకా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. వర్షాకాలంలో రోడ్లు పూర్తిగా బురదమయం అయిపోతాయి. ఈ రెండు తాలుకాల్లో నిర్వాసిత గ్రామాలు మెట్ట ప్రాంతాలలో కట్టుకోవడం వల్ల నీళ్లు దొరకడం కష్టంగా ఉంది.

ఒక్కొక్క గ్రామంలోనూ 10 లేక 20 శాతం కుటుంబాలు బ్రతుకు గడవక వలస వెళ్ళిపోయారు. ఒకప్పుడున్న వ్యవసాయ భూమి చాలా వరకు పోగా కొత్తగా కొనుక్కోవడానికి డబ్బులేక పోవడం వల్ల గ్రామాల జీవన ప్రమాణం పడిపోయింది. రైతులు కూలీలు కాగా కూలీలు భిక్షగాళ్లయ్యారు. కొల్లాపూర్ గ్రామాలలో చాలామంది చేపలు పట్టుకొని బ్రతుకుతున్నారు. పశువులు, గొర్రెలు దాదాపు 75% అమ్ముకున్నారు.

ఆ దుర్భర పరిస్థితి పట్ల తనకేమి బాధ్యత లేనట్లు ప్రభుత్వం ప్రవర్తించడం చాలా దారుణం. ప్రభుత్వంలో భూమి సేకరణ కార్యాలయం ఉంది. దానికి స్పెషల్ కలెక్టర్లున్నారు గానీ పునరావాసానికి కార్యాలయం లేదు, అధికార్లు లేరు.

### శ్రీశైలం ప్రాజెక్టు ముంపు గ్రామాల వివరాలు

| | |
|---|---|
| కర్నూలు జిల్లా | 52 గ్రామాలు |
| మహబూబ్‌నగర్ జిల్లా | 65 గ్రామాలు |

| | | |
|---|---|---|
| 1. | పూర్తిగా మునిగిపోయిన గ్రామాలు | ..... 27 |
| 2. | గ్రామం పూర్తిగాను, కొంత భాగం భూములు మునిగిపోయిన గ్రామాలు | ..... 43 |
| 3. | కొంతపల్లె, కొంత భూములు పోయిన గ్రామాలు | .....10 |
| 4. | కేవలం కొంత భూమి మాత్రమే మునిగిపోయిన గ్రామాలు | ... 35 |


# శ్రీశైలం నిర్వాసితులు - జీవన స్థితిగతులు

శ్రీశైలం నిర్వాసితుల గురించి గతంలో చాలా అద్యయనాలు జరిగాయి. అటువంటి వాటిలో ఢిల్లీలోని లోకాయన్ సంస్థ జరిపిన సర్వే మొదటిది, గణనీయమైనది. 1981లో రిజర్వా యరులో నీళ్లొస్తాయని ఊళ్ళను బలవంతంగా పెకిలించి వేసినపుడు లోకాయన్ సంస్థ మొదటి విడత సర్వే చేసింది. 1984లో ముంపుకు గురైన గ్రామాల కుటుంబాలను కొన్నింటిని రెండవసారి సర్వే చేశారు. నిర్వాసితులవడం వలన ప్రజల ఆర్థిక, సామాజిక జీవితంలో వచ్చిన మార్పులను తెలుసుకోవడమే సర్వే లక్ష్యం. ముంపుకు గురైన 9 గ్రామాల్లోని 258 కుటుంబాలను రెండు దఫాలు సర్వేచేసి నిర్వాసితుల జీవితం ఎలా దిగజారిందో లోకాయన్ రిపోర్టు స్పష్టం చేసింది. సర్వే చేసిన కుటుంబాలలో వివిధ కులాలకు, వివిద ఆర్థిక స్థాయికి చెందిన వారున్నారు. అందుకే సర్వేలోని కొన్ని అంశాలను మీ ముందుంచుతున్నాం.

మొదటి సర్వేలో ఈ గ్రామల్లో నూటికి 17 మంది పెద్ద రైతులుండేవారు. వీరి సంఖ్య 1984 నాటికి 8 శాతానికి తగ్గింది. సర్వే 10 ఎకరాలు అంతకన్నా ఎక్కువ తరి లేదా 20 ఎకరాలపైన మెట్ట భూమి కల రైతులను పెద్ద రైతులుగా వర్గీకరించింది. మధ్య తరగతి రైతులు ముంపునాటికి సర్వే చేసిన గ్రామాల్లో 16% ఉండగా ఆ తర్వాత 8% దిగారు.5 నుండి 9.99 ఎకరాల వరకు లేదా 10 నుండి 19.99 ఎకరాల వరకు మెట్ట భూమి కల రైతులు మధ్యతరగతి రైతులు సన్నకారు రైతులు 36% నుండి 16 శాతానికి తగ్గారు. 5 ఎకరాల లోపు వరి లేక 10 ఎకరాల లోపు మెట్ట భూమి కల రైతులే సన్నకారు రైతులు. వ్యవసాయ కూలీలు 17% నుండి 52% వరకు, అంటే మూడింతలు, పెరిగారు. దీనర్థమేమిటంటే ముంపు వలన గ్రామాల ఆర్థిక స్థాయి దిగజారింది. అన్ని వర్గాల్లోని రైతులు కొంత మంది భూముల్ని కోల్పోయారు.

వ్యవసాయేతర వృత్తుల మీద ఆధారపడ్డ వారి సంఖ్య నూటికి 14 నుండి 18కి పెరిగింది. వ్యవసాయేతర వృత్తుల్లో ఉన్నవారిలో 14% వారి వృత్తులతో పాటు భూవసతులు కలిగి మధ్య తరగతి రైతులుగా ఉండేవారు. 1984 నాటికి వారిలో కేవలం 4% మాత్రమే మధ్యతరగతి వృత్తులుగా ఉన్నారు. వీరిలో సన్నకారు రైతులుగా ఉన్నవారి సంఖ్య కూడా తగ్గింది. వృత్తి పనివారు నిర్వాసితులవడం వలన పూర్తిగా వృత్తి మీద ఆధారపడటం ప్రారంభమైంది. వృత్తుల్లో కూడా కీలకమైన మార్పులు వచ్చాయి.

కుమ్మరులు, గీత కార్మికులు, బెస్తవారు వృత్తిని పూర్తిగా కోల్పోయారు. పాత గ్రామ ప్రాంతాల్లో నున్న ఈత, తాటి చెట్లు ముంపుకు గురి కావడం వలన గీతకార్మికులు వృత్తిని కోల్పోయారు. బెస్తవారు తెప్ప వేసి ప్రజలను క్రిష్ణ దాటిస్తుండేవారు. నదిలో గల కొద్దిపాటి నీటిలో చిన్న చిన్న వలలు వేసి చేపలు పట్టేవారు. వేసవిలో నదిలోని ఇసుక నేలలో అందరితోపాటు వీరు కర్బూజా పండించారు. రిజర్వాయరులో నీళ్ళు రావడంతో మొత్తం ప్రాంతం జలమయమై బెస్తవారు వృత్తిని వదులుకొన్నారు. లోతైన నీటిలో చేపల్ని పట్టే నేర్పరి తనం కాని, అందుకు అనువైన పడవలు కాని లేకపోవడం వలన బెస్తవారు వృత్తి నుండి కూడా నిర్వాసితులయ్యారు. వడ్రంగి, వడ్డెర వంటి వృత్తి పనుల వారికి కొత్త ఇళ్ళ నిర్మాణం వలన ఆదాయం పెరిగింది. పద్మ శాలీలు కొందరు బట్టలు నేయడంతో పాటు వ్యవసాయం చేసే వారు. కొత్త జనవాసాలలో కొందరే బట్టలు నేసేవారు. కొత్త ఇళ్లలో మగ్గాలు ఉంచుకొనే వసతి లేక, పెట్టుబడి లేక చాలా మంది వృత్తిని వదులు కున్నారు. కృష్ణా తీరాల పచ్చిక బీడులు ముంపుకు



లోనై పోవడం వలన గొర్రెల పెంపకం సాధ్యం కాలేదు.

సర్వేజరిపిన గ్రామాల్లో ఆవులు 64%, గేదెలు 50%, దున్నపోతులు 78%, గొర్రెలు 74%, మేకలు 64%, కోళ్లు 61%, ఎద్దులు 38% తగ్గిపోయాయి. ముంపుకు గురికాకముందు నదీ తీరాల్లో గడ్డి బాగా పెరిగేది. అవిముంపుకు గురికావడం వలన మేత కరువైంది. కొత్త స్థావరాల్లో బీడు భూములు లేవు. పంటభూములూ తగ్గాయి. ఇందుమూలంగా మేత కరువు తీవ్రతరమైంది. వీటికి తోడుగా ఆర్థిక పరిస్థితి దిగజారడంతో చాలా మంది రైతులు, రైతు కూలీలు పశువులను అమ్ముకున్నారు.

సర్వే జరిపిన కుటుంబాలలో గొల్లలు 67% గొర్రెలను, కూలీలు మొత్తం గొర్రెలను, 91% మేకలను, సన్నకారు రైతులు 82% గొర్రెలు, 96% మేకలు అమ్ముకున్నారు. పెద్ద రైతుల వద్ద గొర్రెలు 84% తగ్గిపోయాయి.

వ్యవసాయానికి అవసరమైన పశువులు ధనిక వర్గాల వద్దనే ఎక్కువగా ఉంటాయి. సన్నగారు రైతులు, కూలీలు తమ వద్ద నున్న కొద్దిపాటి ఆవులు, ఎద్దులు, దున్నపోతుల్లో చాలా మట్టుకు కోల్పోయారు. మేతకొరత వలన కొన్ని చనిపోగా కొన్నింటిని అమ్ముకున్నారు. వ్యవసాయ కూలీలు తమ వద్దనున్న ఎడ్లలో 79%, సన్నకారు రైతులు 43%, మధ్య, పెద్ద తరగతి రైతులు 34%, ఎడ్లను కోల్పోయారు.

పై మార్పుల వలన 1981-84 మధ్యకాలంలో పగటు కుటుంబ ఆదాయం 9116 రూపాయల నుండి 2347 రూపాయలకు పడిపోయింది. ఈ దుస్థితి నుంచి బయటపడటానికి రైతులు అప్పుల పాలయ్యారు. 1987 నాటికి సర్వేజరిపిన గ్రామాల్లో 62% కుటుంబాలకు అప్పులుండగా అది 1984 నాటికి 91% పెరిగింది.

పాత గ్రామాల్లో తలసరి అప్పు 4810 రూపాయలుండేది. అవి 1984 నాటికి 12462 రూ॥లకు పెరిగింది. అప్పుల్లో కూడా వర్గ స్వభావం స్పష్టంగా కనబడుతుంది. పాత గ్రామాల్లో పెద్ద రైతులకు తలసరి అప్పు 10,500 దాకా ఉండగా 1984 నాటికి తలసరి అప్పు 32,297కి పెరిగింది. మధ్యతరగతి రైతుల తలసరి అప్పు ఈ కాలంలో 6, 903 నుండి 10,100కి పెరిగింది. అలాగే, సన్నకారు రైతుల తలసరి రుణం 1981-84 మధ్య కాలంలో 4144 రూపాయల నుండి 8633 రూపాయలకు పెరిగింది. కూలీల తలసరి అప్పు 949 నుండి 4771కి పెరిగింది. ఇతర వృత్తుల వారి తలసరి అప్పు 4208 నుండి 8908కి పెరిగింది. ఈ విధంగా నిర్వాసితులైన వారంతా అప్పుల్లో కూరుకొనిపోయారు. కొత్తగా అప్పులు ఇచ్చింది ఎక్కువ భాగం ధనిక రైతులే.

ప్రభుత్వం భూములకు ఇచ్చిన నష్టపరిహారం చాలా తక్కువే. అందులో పోరంబోకు భూముల్ని సాగుచేసుకుంటున్న వారికి నష్టపరిహారం ఇవ్వలేదు. దళితుల్లో కేవలం పోరంబోకు భూమిపైనే ఆధారపడి బతికేవాళ్లు చాలా ఎక్కువ. తరి భూముల మార్కెటు రేటు ఎకరాకు దాదాపు 20,000 రూ॥ ఉండేది. కాని ప్రభుత్వం సగటున ఎకరాకు చెల్లించిన రేటు 3,547 రూ॥ మాత్రమే. అలాగే మెట్ట భూముల రేటు 9 వేల రూపాయలుండగా ప్రభుత్వం కేవలం 1820 రూ॥ చెల్లించింది. నష్టపరిహారంతో కొత్తగా కొన్న భూములు అతి స్వల్పం. పెద్ద రైతులు ఎకరాకు సగటున 27 వేల రూపాయల చొప్పున 2.5 ఎకరాల తరి పొలం కొన్నారు. మెట్టభూమి సగటున 5,586 రూ॥ చొప్పున 2.56 ఎకరాలు కొన్నారు. మధ్య తరగతి రైతులు, సన్నకారు రైతులు తరి భూమిని కొనలేదు. ఏదో కొద్దిగా మెట్ట భూమిని కొనగలిగారు. పరిశీలించిన కుటుంబాలు మొత్తం కలిపి కోల్పోయిన తరి భూమిలో 1%, మెట్ట భూమిలో 8% మాత్రమే కొనగలిగారు. ఇలా కొన్న భూమి కూడా ఎక్కువ భాగం పెద్ద రైతులే కొన్నారు. కొత్తగా కొన్న భూముల్లో తరి భూమిలో 100%, మెట్ట భూమిలో 68% పెద్ద రైతులే కొన్నారు. వచ్చిన నష్టపరిహారం ఒకేసారి కాక వాయిదాల పద్ధతిలో రావడం ముంపుకు గురయ్యే గ్రామాలు శాశ్వతంగా పోతాయి అని అనుకోకపోవడం వలన, భూముల రేట్లు పెరగడం వలన కొత్తగా భూమిని కొనాలని ఎవ్వరూ ఆలోచించలేదు. నష్టపరిహారం పొందిన వారిలో కేవలం నూటికి నలుగురు మాత్రమే కొత్తగా భూములు కొన్నారు. 20% మంది ఇళ్లు కట్టేందుకు నష్టపరిహారపు సొమ్మును వాడారు. 26% మంది పాత బాకీలు తీర్చగా మిగిలిన వాళ్లు ఇంటి ఖర్చులకు, అత్యవసరమైన కార్యాలకు ఇచ్చిన డబ్బును వాడుకున్నారు.

ముంపుకు గురైన ఇళ్లకు ఇచ్చిన నష్ట పరిహారం చాల తక్కువే. అసలు ధరకు పావలా వంతు మాత్రమే నష్ట పరిహారం ముట్టింది. ఎక్కువగా రాతి ఇండ్లు ఉండటం ఈ ప్రాంత విశేషం. పాత గ్రామాల్లో 81% ఇళ్ళు రాతివి కాగా కొత్తగా కట్టిన ఇళ్ళలో 53%మాత్రమే రాతివి. పై కప్పు గడ్డితో వేసుకున్న ఇళ్ళు గతంలో 56 ఉండగా ఇవి కొత్త ప్రదేశాల్లో 122కి పెరిగాయి. అంతేకాక పూర్వపు ఇండ్ల కన్నా ఇవి చాలా చిన్నవి. ఇంటికి గాను ఇచ్చిన నష్ట పరిహారంతో పరిశీలించిన కుటుంబాలలో 12% మంది కొత్త ఇళ్ళు కట్టుకున్నారు. సన్నకారు రైతుల్లో 39% వ్యవసాయ కూలీలలో 36% పెద్ద రైతుల్లో 17% పాత అప్పులు తీర్చడానికి నష్టపరిహారాన్ని వాడుకున్నారు. అందువలన నూటికి 70% మంది కొత్తగా ఇల్లు కట్టిన వారు అప్పు చేశారు. 7% చరాస్థిని అమ్మి ఇళ్ళు కట్టారు. కొందరు పొలానికి వచ్చిన నష్టపరిహారాన్ని ఇళ్లు కట్టడానికి వాడారు. కొంతమంది యస్.సి. లకు మాత్రం ప్రభుత్వం సహాయం అందజేసింది. కొత్త స్థావరాలలో ఉపాధి దొరకక వలస పోతున్న వాళ్ళు చాలామంది ఉన్నారు.

ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం ముంపు యొక్క పరిణామాలను, భూ సేకరణ చట్టం గురించి సరిగ్గా వివరించి కొన్ని అనువైన స్థావరాల్లో భూములిచ్చి ఇళ్ళు కట్టుకోవడానికి కనీస సౌకర్యాలు ఏర్పర్చి ఉంటే నిర్వాసితుల బాధలు తప్పేవి. ●